మన ప్రజా ప్రతినిధి
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
తెలుగు దినపత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :304 శుక్రవారం ఆగష్టు 28 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

# హిమాలయాన్ని కుదిపేసిన.... నేపాల్ మహా విపత్తు

- 168 మందికి పైగా మృతి.. వేలాది మంది గల్లంతు
- హిమనదం కూలిపోవడంతో విరుచుకుపడ్డ జలప్రళయం
- కైలాస్ యాత్రికులు, విదేశీ పర్యాటకుల ఆచూకీ కోసం గాలింపు
- మరో వరద ముప్పుపై అధికారుల హెచ్చరిక



ఖాట్మండు, ఆగస్టు 27 (మనప్రజాప్రతినిధి): నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతాన్ని అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు అపూర్వ విధ్వంసాన్ని సృష్టించాయి. హిమాలయాల్లోని ఒక భారీ హిమనదం కూలిపోవడంతో ఏర్పడిన నీరు, బురద, రాళ్ల ప్రవాహం భోటే కోషి, త్రిశూలీ నదీ పరివాహక ప్రాంతాలపై విరుచుకుపడింది. తాజా సమాచారం ప్రకారం మృతుల సంఖ్య 165 నుంచి 168 మధ్యకు చేరుకోగా, 1,300 నుంచి 1,500 మంది వరకు ఇంకా గల్లంతైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. నేపాల్ చరిత్రలో ఇటీవలి కాలంలో సంభవించిన అత్యంత ఘోర ప్రకృతి విపత్తుల్లో ఇది ఒకటిగా నిలిచింది. బుధవారం ఉదయం స్థానిక కాలమానం ప్రకారం సుమారు 8:40 గంటల సమయంలో ఈ విపత్తు సంభవించింది. మొదట భూకంపం వచ్చినట్లు భావించిన అధికారులు, అనంతర పరిశీలనలో ఇది హిమనదం కుప్పకూలడం వల్ల జరిగిన భారీ శిథిల ప్రవాహమని నిర్ధారించారు. వేల టన్నుల మంచు, రాళ్లు, మట్టి ఒక్కసారిగా లోయల్లోకి దూసుకెళ్లడంతో నదుల్లో జలప్రవాహం అమాంతం పెరిగి దిగువ ప్రాంతాలను ముంచెత్తింది. సీసీటీవీ దృశ్యాల్లో బహుళ అంతస్తుల భవనాల ఎత్తుకు సమానంగా బురద, నీటి గోడ దూసుకురావడం కనిపించడం విపత్తు తీవ్రతను తెలియజేస్తోంది. రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాలు అత్యధికంగా ప్రభావితమయ్యాయి. పలు గ్రామాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. కనీసం 19 వంతెనలు, 40 కిలోమీటర్లకు పైగా రహదారులు కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టులు

2

## నకిలీ వైద్యుల పట్ల అప్రమత్తంగా ఉండాలి సజ్జనార్



- ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న మోసగాళ్లపై నిఘా
- 12 మంది నకిలీ వైద్యులపై చర్యలు
- చికిత్సకు ముందు అర్హతలు పరిశీలించాలని సూచన
- అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

2

## గవర్నర్‌ను పరామర్శించిన ముఖ్యమంత్రి



- యశోదా ఆస్పత్రిలో ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- శివ ప్రతాప్ శుక్లాకు ధైర్యం చెప్పిన సీఎం
- వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న రేవంత్ రెడ్డి
- సీఎంతో పాటు ఎంపీ వేం నరేందర్ రెడ్డి హాజరు

2

## హరీష్‌రావు అరెస్టుతో వరంగల్‌లో ఉద్రిక్తత



- ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన బీఆర్ఎస్ నేత
- అరెస్టు యత్నాన్ని అడ్డుకున్న పార్టీ శ్రేణులు
- సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- స్టేషన్ ముందు బీఆర్ఎస్ కార్యకర్తల ధర్నా

2

## జీవో 97పై ఈటల రాజేందర్ విమర్శలు



- పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన
- 22ఏ అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎంపీ
- ప్రజావ్యతిరేక నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్
- హౌస్ అరెస్ట్ ఘటనను ఖండించిన బీజేపీ

2

## విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం మంత్రి

- గోపాలపురం పాఠశాలకు నూతన తరగతి గదులు
- రూ.30 లక్షల పనులకు మంత్రి శంకుస్థాపన
- సాంకేతిక విద్యతో యువతకు అవకాశాలు
- మహిళలకు రాఖీ శుభాకాంక్షలు తెలిపిన పొంగులేటి

ఖమ్మం, ఆగస్టు 27 (మనప్రజాప్రతినిధి): తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్య, వైద్య రంగాల బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం తిరుమలయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామపంచాయతీ పరిధిలోని గోపాలపురంలో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న ప్రాథమిక పాఠశాల తరగతి గదుల నిర్మాణ పనులకు ఆయన

3

## మణిపూర్‌లో ఉగ్రదాడి...నలుగురు మృతి

- వాహనాన్ని అడ్డగించి కాల్పులు
- మరో వ్యక్తి ఆచూకీ గల్లంతు
- నాగా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత
- నిందితుల కోసం ముమ్మర గాలింపు

ఇంఫాల్, ఆగస్టు 27 (మనప్రజాప్రతినిధి): తరచూ హింసాత్మక ఘటనలతో వార్తల్లో నిలిచే మణిపూర్‌లో మరోసారి రక్తపాతం చోటుచేసుకుంది. కాంగ్‌పోక్పి జిల్లాలోని మకుయి అషాంగ్‌తబాంబా నాగా ప్రాంతాల మధ్య గురువారం జరిగిన ఉగ్రదాడిలో నలుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తిని సాయుధులు తమ వెంట తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనతో ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసుల వివరాల ప్రకారం,

3

## బీఆర్ఎస్‌పై కవిత సంచలన ఆరోపణలు



- పార్టీని హస్తగతం చేసుకునే కుట్ర జరుగుతోందని వ్యాఖ్యలు
- హరీష్ రావు, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెట్టారంటూ ఆరోపణలు
- ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా టీఆర్ఎస్‌ను బలోపేతం చేస్తామని స్పష్టం

3

# హిమాలయాన్ని కుదిపేసిన...నేపాల్ మహావిపత్తు

మెదటి పేజీ తరువాయి



ధ్వంసమవడంతో విద్యుత్ సరఫరా దెబ్బతింది. అనేక ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థలు నిలిచిపోయాయి. కొన్ని గ్రామాలు పూర్తిగా బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. గల్లంతైన వారిలో విదేశీ పర్యాటకులు, కైలాస్ మానససరోవర్ యాత్రికులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. నేపాల్ అధికారుల వివరాల ప్రకారం వందలాది విదేశీయుల ఆచూకీ ఇంకా లభించలేదు. భారతీయులు, అమెరికన్లు, బ్రిటన్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, కెనడా, మలేషియా తదితర దేశాల పౌరులు గల్లంతైన వారి జాబితాలో ఉన్నారు. భారత విదేశాంగ శాఖ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తుండగా, నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దాదాపు 300 మంది భారతీయులు గల్లంతైన వారిలో ఉన్నట్లు నేపాల్ విదేశాంగ మంత్రి వెల్లడించారు. విపత్తు ప్రాంతాల్లో సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. నేపాల్ సైన్యం, పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు హెలికాప్టర్లు, డ్రోన్ల సహాయంతో గాలింపు చేపడుతున్నాయి. ఇప్పటివరకు వందలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.







అయితే భారీ బురద, దెబ్బతిన్న రహదారులు, కొనసాగుతున్న వర్షాలు సహాయక చర్యలకు తీవ్ర ఆటంకంగా మారుతున్నాయి. అనేక ప్రాంతాల్లో శిథిలాల కింద ఇంకా ప్రజలు చిక్కుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ విపత్తు ప్రభావం నేపాల్‌కే పరిమితం కాలేదు. సరిహద్దు అవతల టిబెట్‌లో కూడా ప్రాణనష్టం సంభవించింది. చైనా అధికారులు వందలాది సహాయక సిబ్బందిని రంగంలోకి దించారు. ఐక్యరాజ్యసమితి, రెడ్ క్రాస్, పలు దేశాలు అత్యవసర సహాయం అందించేందుకు ముందుకొచ్చాయి. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించగా, నేపాల్ ప్రభుత్వం అంతర్జాతీయ సహకారం కోరుతోంది. ఇదిలా ఉండగా, శాస్త్రవేత్తలు మరో ప్రమాదంపై హెచ్చరిస్తున్నారు. హిమనదం కూలిన ప్రాంతంలో నదీ ప్రవాహాన్ని అడ్డుకుంటూ భారీ మట్టి, రాళ్ల అడ్డంకి ఇంకా కొనసాగుతోందని, అది ఒక్కసారిగా తెగిపోతే రెండోసారి వరదలు సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో నేపాల్‌తో పాటు భారత సరిహద్దు రాష్ట్రాలైన బీహార్, ఉత్తరప్రదేశ్‌లలోనూ అప్రమత్తత ప్రకటించారు. వాతావరణ మార్పుల ప్రభావంతో హిమాలయ ప్రాంతంలో హిమానీనదాలు వేగంగా కరుగుతున్నాయని, ఇలాంటి విపత్తుల ముప్పు భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్లేసియర్‌ల అస్థిరత, తీవ్రమైన వర్షాలు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కలిసి హిమాలయ ప్రాంతాన్ని ప్రమాదకర మండలంగా మారుస్తున్నాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ నేపాల్ విపత్తు ప్రపంచానికి మరోసారి ప్రకృతి హెచ్చరికగా నిలిచిందని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం నేపాల్ అంతటా విషాదఛాయలు అలుముకున్నాయి. గల్లంతైన వారి కోసం కుటుంబ సభ్యులు ఆందోళనగా ఎదురుచూస్తుండగా, సహాయక బృందాలు శిథిలాల మధ్య ప్రాణాలతో బయటపడిన వారిని వెతికే ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతుండటంతో దేశవ్యాప్తంగా ఆందోళన నెలకొంది. ఈ విపత్తు హిమాలయ ప్రాంత చరిత్రలో అత్యంత విషాదకర ప్రకృతి వైపరీత్యాల్లో ఒకటిగా నమోదు కానుంది.

# గవర్నర్‌ను పరామర్శించిన ముఖ్యమంత్రి

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, ఆగస్టు 27 (మనప్రజాప్రతినిధి): అనారోగ్యంతో హైటెక్ సిటీలోని యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం పరామర్శించారు. ఆస్పత్రికి వెళ్లిన ముఖ్యమంత్రి గవర్నర్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్స వివరాలను కూడా తెలుసుకుని గవర్నర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడిన ముఖ్యమంత్రి, ప్రస్తుతం అందుతున్న వైద్య సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందేలా చర్యలు కొనసాగించాలని సూచించినట్లు సమాచారం. గవర్నర్ ఆరోగ్యంపై ప్రభుత్వం నిరంతరం దృష్టి సారిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గవర్నర్‌కు ధైర్యం చెప్పారు. ఆరోగ్య పరిరక్షణకు వైద్యుల సూచనలను పాటించాలని సూచిస్తూ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో విధుల్లోకి రావాలని ఆకాంక్షించారు. గవర్నర్ కూడా ముఖ్యమంత్రితో కొద్దిసేపు మాట్లాడినట్లు తెలిసింది. గవర్నర్‌ను పరామర్శించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వెంట ఎంపీ వేం నరేందర్ రెడ్డి కూడా ఉన్నారు. వారు ఆస్పత్రి అధికారులు, వైద్య బృందంతో మాట్లాడి గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. చికిత్సకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిన తర్వాత వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఆయన ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు. త్వరగా కోలుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు ఆకాంక్షలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి పరామర్శతో గవర్నర్ ఆరోగ్యంపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ మరోసారి స్పష్టమైంది. గవర్నర్ త్వరగా కోలుకుని సాధారణ కార్యకలాపాల్లో పాల్గొనాలని రాష్ట్ర ప్రజలు కూడా ఆకాంక్షిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి వైద్యుల పర్యవేక్షణలో ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

# నకిలీ వైద్యుల పట్ల అప్రమత్తంగా ఉండాలి సజ్జనార్

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, ఆగస్టు 27 (మనప్రజాప్రతినిధి): వైద్యం పేరుతో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యుల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు హైదరాబాద్ పోలీసులు కట్టుబడి ఉన్నారని పేర్కొంటూ, ఇటీవలి కాలంలో నగరంలో నకిలీ వైద్యులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నగరంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 12 మంది నకిలీ వైద్యులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు సజ్జనార్ వెల్లడించారు. ఎలాంటి వైద్య అర్హతలు లేకుండా, కనీస వైద్య పరిజ్ఞానం కూడా లేని కొందరు వ్యక్తులు వైద్యులుగా నటిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారని హెచ్చరించారు.ఇలాంటి నకిలీ వైద్యులు రోగులకు విచక్షణారహితంగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, రక్తపోటు, మధుమేహం మందులు ఇవ్వడమే కాకుండా అవసరం లేకపోయినా ఇంజెక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తున్నారని తెలిపారు. దీంతో రోగుల ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాల వంటి కీలక అవయవాలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు చికిత్స కోసం వెళ్లే ముందు క్లినిక్‌లు, ఆసుపత్రుల వద్ద జిల్లా వైద్యారోగ్య శాఖ (డీఎంహెచ్‌వో) జారీ చేసిన అధికారిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అలాగే వైద్యుల బోర్డులపై పేరు, విద్యార్హతలు, తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్‌ఎంసీ) రిజిస్ట్రేషన్ నంబర్ స్పష్టంగా ప్రదర్శించి ఉండాలని తెలిపారు.వైద్యుల అర్హతలపై సందేహం ఉంటే టీఎస్‌ఎంసీ అధికారిక వెబ్‌సైట్‌లో డాక్టర్ పేరు లేదా రిజిస్ట్రేషన్ నంబర్ నమోదు చేసి వివరాలను ధృవీకరించుకోవచ్చని పేర్కొన్నారు. అక్కడ వివరాలు కనిపించకపోతే ఆ వ్యక్తి అర్హతలేని వైద్యుడిగా భావించాలని సూచించారు. చికిత్స విధానం లేదా సిబ్బంది ప్రవర్తనపై అనుమానం వచ్చినప్పుడు మరో అర్హత కలిగిన వైద్యుడి వద్ద రెండో అభిప్రాయం తీసుకోవాలని చెప్పారు. నకిలీ వైద్యులు ఎక్కడైనా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే డయల్-112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సజ్జనార్ ప్రజలను కోరారు. ప్రజల ఆరోగ్యం, ప్రాణాలను కాపాడేందుకు హైదరాబాద్ పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తారని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతోనే ఇలాంటి మోసగాళ్లను పూర్తిగా అరికట్టగలమని ఆయన పేర్కొన్నారు.

# హరీష్‌రావు అరెస్టుతో వరంగల్‌లో ఉద్రిక్తత

మెదటి పేజీ తరువాయి



వరంగల్, ఆగస్టు 27 (మనప్రజాప్రతినిధి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును హనుమకొండ జిల్లా సుబేదారి పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌కుమార్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలను కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనతో వరంగల్-హనుమకొండ ప్రాంతాల్లో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి హరీష్‌రావు సంఘీభావం తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తూ వారితో కలిసి మాట్లాడారు. అనంతరం అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళన కార్యక్రమానికి వెళ్లనున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. హరీష్‌రావు తదుపరి కార్యక్రమాలకు వెళ్లకుండా అడ్డుకునేందుకు లా అండ్ ఆర్డర్, టాస్క్‌ఫోర్స్, ప్రత్యేక పోలీసు బలగాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఉద్యోగుల ధర్నా అనంతరం హరీష్‌రావును అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ప్రతిఘటించారు. దీంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు హరీష్‌రావును సుబేదారి పోలీస్ స్టేషన్‌కు కాలినడకన తరలించారు. ఈ సందర్భంగా ఆయనకు మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో చేరుకుని నినాదాలు చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పోలీసులు తీసుకున్న చర్యలను ఖండించారు. హరీష్‌రావు అరెస్టు వార్త తెలిసిన వెంటనే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సుబేదారి పోలీస్ స్టేషన్‌కు భారీగా తరలివచ్చారు. స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. అరెస్టు చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో హనుమకొండలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగానే అరెస్టులు చేసినట్లు పోలీసు వర్గాలు పేర్కొనగా, ప్రజాస్వామ్య హక్కులను ప్రభుత్వం అణచివేస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

# జీవో 97పై ఈటల రాజేందర్ విమర్శలు

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, ఆగస్టు 27 (మనప్రజాప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పలు నిర్ణయాలపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లోని తార్నాకలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తితో ఉన్నారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని గుర్తించి పాలకులు తమ వైఖరిని మార్చుకోవాలని సూచించారు. 22ఏ అంశాన్ని ప్రస్తావించిన ఈటల రాజేందర్, 1965లో ఏర్పడిన ఆర్‌కే పురం కాలనీని 22ఏ జాబితాలో చేర్చడాన్ని తప్పుబట్టారు. దశాబ్దాలుగా నివసిస్తున్న ప్రజల ఆస్తి హక్కులను ప్రశ్నార్థకం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయనే ప్రభుత్వ వ్యాఖ్యలను ఖండిస్తూ, ప్రజాక్షేత్రంలోకి వచ్చి బాధితుల సమస్యలు తెలుసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు.పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించిన జీవో నెంబర్ 97పై కూడా ఈటల రాజేందర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని, అనేక మంది ఉన్నత విద్యలో కూడా రాణిస్తారని పేర్కొన్నారు. అలాంటి విద్యా వ్యవస్థను బలహీనపరిచేలా తీసుకున్న నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. జీవో 97 కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులను స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లోకి మళ్లించడం ద్వారా వారి విద్యా అవకాశాలు పరిమితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే అంశాలపై ప్రభుత్వం విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండగా, ఏకపక్షంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లకుండా హౌస్ అరెస్ట్ చేయడాన్ని కూడా ఈటల రాజేందర్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లే నాయకులను అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రజా సమస్యలను పోలీసు బలంతో అణచివేయాలని ప్రయత్నిస్తే అది మరింత వ్యతిరేకతకు దారితీస్తుందని హెచ్చరించారు. జీవో నెంబర్ 97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రజావ్యతిరేక విధానాలు కొనసాగితే ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్, పార్టీ నాయకులు మహిపాల్, మల్క యశస్వి, విద్యార్థులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌పై కవిత సంచలన ఆరోపణలు

తరువాయి భాగం



హైదరాబాద్, ఆగస్టు 27 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వం, కొందరు ప్రముఖ నాయకులపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై స్పందిస్తూ బీఆర్ఎస్ పార్టీని కొందరు నేతలు హస్తగతం చేసుకునేందుకు అంతర్గతంగా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా హరీష్ రావు వ్యవహారశైలిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, పార్టీ భవిష్యత్తు నాయకత్వంపై రహస్యంగా చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ వంటి నాయకుడిని పక్కనబెట్టి పార్టీపై పూర్తి నియంత్రణ సాధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారం తనకు అందిందని వెల్లడించారు. ఇటీవల మెదక్ జిల్లాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశాల్లో పార్టీ వారసత్వ రాజకీయాలు, భవిష్యత్తు వ్యూహాలపై చర్చలు జరిగాయని ఆరోపించారు. ఈ సందర్భంగా హరీష్ రావుపై పలు ఆర్థిక, రాజకీయ ఆరోపణలు చేసిన కవిత, ఆయన గతంలో మంత్రిగా పనిచేసిన సమయంలో కొన్ని ప్రైవేటు సంస్థలతో భారీ స్థాయిలో వ్యాపార సంబంధాలు కొనసాగించారని వ్యాఖ్యానించారు. విద్యాసంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రులతో జరిగిన వ్యాపార వ్యవహారాలపై ప్రభుత్వం దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే లండన్‌లో జరిగినట్లు చెబుతున్న కొన్ని సమావేశాలపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తూ, వాటి వెనుక ఉన్న అంశాలను తమ పార్టీ దశలవారీగా ప్రజల ముందుకు తీసుకువస్తుందని తెలిపారు. నిజంగా ఎలాంటి రాజకీయ లేదా ఆర్థిక ఒప్పందాలు జరగలేదంటే సంబంధిత అంశాలపై విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని ముఖ్యమంత్రిని కోరారు. రాజకీయంగా పరస్పరం విమర్శించుకోవాల్సిన వారు మౌనంగా ఉండటం వెనుక కారణాలు ఏమిటో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా కవిత తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగడం లేదని, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అనేక కీలక అంశాల్లో ప్రభుత్వం స్పందించడంలో విఫలమైందని ఆరోపించారు. కృష్ణా జలాల పంపిణీ, ఉద్యోగ అవకాశాలు, రాష్ట్రానికి సంబంధించిన పలు సంస్థల్లో నియామకాలు, తెలంగాణకు రావాల్సిన హక్కుల విషయంలో ప్రభుత్వం తగిన పోరాటం చేయడం లేదన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి విరుద్ధంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కంటే ఇతర అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే భావన ప్రజల్లో పెరుగుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తెలంగాణ హక్కుల విషయంలో మరింత దృఢంగా వ్యవహరించాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీపై కూడా కవిత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన ప్రధాన ప్రతిపక్షం ప్రజా సమస్యలపై సమర్థవంతంగా స్పందించడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న వివిధ ఘటనలు, ప్రజలకు సంబంధించిన సమస్యలపై బీఆర్ఎస్ ఆశించిన స్థాయిలో పోరాటం చేయడం లేదన్నారు. అధికార పార్టీతో బీఆర్ఎస్ రాజీ పడిందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో బీఆర్ఎస్ వ్యవస్థీకృత అవినీతికి పాల్పడిందని ఆరోపిస్తూ, ఆ పార్టీ పాలనలో జరిగిన అనేక వ్యవహారాలపై ఇప్పటికీ ప్రశ్నలు మిగిలే ఉన్నాయని అన్నారు. అవినీతి, కుటుంబ పాలన, వారసత్వ రాజకీయాల కారణంగానే ప్రజలు బీఆర్ఎస్‌ను తిరస్కరించారని వ్యాఖ్యానించారు. తెలంగాణలో సామాజిక న్యాయం, బీసీల హక్కులు, స్థానికుల ప్రయోజనాల విషయంలో కూడా కవిత పలు అంశాలను ప్రస్తావించారు. బీసీలకు తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించడంలో ప్రధాన రాజకీయ పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలోని వివిధ బోర్డులు, సంస్థల్లో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగాలన్నారు. రాష్ట్ర యువతకు ఉద్యోగ అవకాశాలు, రైతులకు భరోసా, మహిళలకు భద్రత, వెనుకబడిన వర్గాలకు సముచిత అవకాశాలు కల్పించడమే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని సూచించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే రాజకీయాలకే ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేయడమే తమ లక్ష్యమని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. అవినీతి రహిత పాలన, జవాబుదారీతనం, పారదర్శక రాజకీయ వ్యవస్థ కోసం తమ పార్టీ పని చేస్తుందని తెలిపారు. ప్రజల సమస్యలపై రాజీ పడకుండా పోరాడుతామని, తెలంగాణ హక్కుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం కొత్త రాజకీయ ఆలోచన అవసరమని, ప్రజలు సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా ఆలోచించాలని కోరారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రత్యామ్నాయ వేదికగా టీఆర్ఎస్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఆమె వెల్లడించారు.

# విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం మంత్రి

తరువాయి భాగం



శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మంత్రి మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. గత పాలకులు అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించిన మంత్రి, ప్రజల ఆశీర్వాదాలతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నరేళ్లలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలకు గతంతో పోలిస్తే రెండు నుంచి మూడు రెట్లు అధిక నిధులు కేటాయించినట్లు చెప్పారు. ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులను నిర్మిస్తూ, వైద్యులు, సిబ్బందిని నియమిస్తున్నామని వివరించారు. సాంకేతిక విద్య బలోపేతానికి స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యతనిస్తూ యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి యువతే ప్రధాన శక్తి అని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు గత రెండున్నరేళ్లలో భారీ స్థాయిలో రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన వారంతా ఈ నెల 31లోపు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యక్రమానికి హాజరైన మహిళలతో పాటు పాలేరు నియోజకవర్గం, రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ ముందస్తుగా రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మణిపూర్‌లో ఉగ్రదాడి...నలుగురు మృతి

తరువాయి భాగం



సాయుధులైన దుండగులు ప్రయాణికులతో వెళ్తున్న ఒక వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని దాడికి పాల్పడ్డారు. వాహనంలో ఉన్న లియాంగ్మై నాగా తెగకు చెందిన నలుగురిని కాల్చిచంపారు. అనంతరం మరో వ్యక్తిని బలవంతంగా తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అతడి ఆచూకీ ఇప్పటివరకు తెలియరాలేదని అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, భద్రతా బలగాలు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చాయి. మృతదేహాలను స్వాధీనం చేసుకుని సేనాపతి జిల్లా ఆస్పత్రికి తరలించారు. గల్లంతైన వ్యక్తి కోసం ప్రత్యేక గాలింపు బృందాలను రంగంలోకి దించారు ఈ ఘటనతో నాగా తెగ ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. తమ భద్రతపై భయాందోళనలు వ్యక్తం చేస్తూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా ఉండేందుకు పోలీసులు అదనపు బలగాలను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. దాడికి నిరసనగా స్థానికంగా ఉన్న దుకాణాలు, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసివేయబడ్డాయి. నాగా పీపుల్స్ ఆర్గనైజేషన్ (ఎన్‌పీవో) బంద్‌కు పిలుపునివ్వడంతో సాధారణ జనజీవనం కొంత మేర ప్రభావితమైంది. ప్రజలు పెద్ద సంఖ్యలో నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ దాడి వెనుక ఉన్న కారణాలు, బాధ్యులు ఎవరు అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. గల్లంతైన వ్యక్తిని సురక్షితంగా గుర్తించడంతో పాటు ప్రాంతంలో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు భద్రతా బలగాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి.

# కుకునూరు గ్రామసభలో ఎస్ఐఆర్ క్షేత్రస్థాయి పరిశీలన – ఆర్ఐ నర్సింగ్



మన ప్రజా ప్రతినిధి నర్సాపూర్ 27: వెల్దుర్తి మండలం కుకునూరు గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ క్షేత్రస్థాయిలో ఆర్ఐ నర్సింగ్ గారు పరిశీలించారు. పోలింగ్ బూత్ నెం. 43 44 45 పరిధిలో ఇంటింటి సర్వే, ఓటర్ల వివరాల నమోదు సరిగ్గా జరుగుతుందో లేదో ఆయన స్వయంగా పరిశీలించారు. గ్రామ సభలో సర్ సర్వే ప్రకారం ఓటరు జాబితాలో మరణించిన వారు పెళ్లయిన వారు చదివి వినిపించడం జరిగింది. కుటుంబ సభ్యుల మ్యాపింగ్ చేయని వారికి సరిచేసుకునుటకు నోటీసులు జారీ చేశారు అలాగే మీ యొక్క ఓటర్ లిస్ట్ నందు మీ పేర్లు కానీ ఇంకేమైనా అభ్యంతరాలు ఉంటే తెలుపగలరని అన్నారు. బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు ఎస్ఐఆర్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ విజయలక్ష్మి ఆర్ఐ నర్సింగ్ జిపిఓ బీఎల్ఓ, గ్రామ సర్పంచ్ సాయిలు గ్రామ కార్యదర్శి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పర్యటించిన మల్కాజ్గిరి నగరపాలక సంస్థ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్: మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ నగర్ లో మల్కాజిగిరి నగరపాలక సంస్థ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా జవహర్ నగర్ డివిజన్ మరియు చంద్రపురి కాలనీ గ్రామ కంఠంలో ఉన్నటువంటి గృహాలకు మరియు 58,59 జీవో పట్టాలు ఉన్నట్టువంటి గృహాలకు ఇల్లు నిర్మించుకోవడానికి అనుమతులు ఇచ్చుట. 58 మరియు 59 పట్టాలు ఉన్నటువంటి వారికి కొత్త ఇంటి నంబర్ తీసుకున్నటకు గాను అనుమతులు ఇచ్చుట మల్కాజ్గిరి నగరపాలక సంస్థ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కీసర సర్కిల్ కమిషనర్ రామలింగం, మాజీ మేయర్ చంద్రపురి డివిజన్ అధ్యక్షురాలు శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా, జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు కల్లేపల్లి సదానందం, మాజీ సర్పంచ్ కార్ంగుల శంకర్ గౌడ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలపరిష్కారానికి టి జి ఈ జె ఎ సి,మహాధర్నా సిరిసిల్ల కలెక్టరేట్ ముట్టడి



మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్ల ఆగస్టు ,27: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ టి జి ఈ జె ఎ సి,ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట భారీ మహాధర్నా నిర్వహించారు. ఈ ఆందోళన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా టి జి ఈ జె ఎ సి, జిల్లా నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. 2వ పి ఆర్ సి ,అమలు నివేదికను వెంటనే అమలు చేయాలి. పెండింగ్‌లో ఉన్న 6 డి ఎ,లను తక్షణమే మంజూరు చేయాలి. సిపిఎస్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని ( ఓ పి ఎస్) అమలు చేయాలి. ఈ హెచ్ సి, ని సమర్థవంతంగా అమలు చేసి వైద్య సదుపాయం అందేలా చూడాలి. పెండింగ్‌లో ఉన్న రూ. 2 వేల కోట్ల బిల్లులను ప్రతి నెలా విడుదల చేయాలి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, పెన్షనర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# సిఐ సైదులు కి మర్యాదపూర్వకంగా ధన్యవాదాలు తెలిపిన మల్లెపూల శ్రీకాంత్ యాదవ్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ పరిధి జవహర్ నగర్ లో బోనాల జాతర ను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను జరుపుటకు బందోబస్తును నిర్వహించిన జవహర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సైదులు గారిని, సబ్ ఇన్స్పెక్టర్ రాము నాయక్ ని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేసిన చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ , మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ , సీనియర్ నాయకులు బింగి సతీష్ గౌడ్, అశోక్ గుప్తా, యాకచారి , బల్లి శ్రీధర్, మిట్టు, బబ్లూ ముదిరాజ్, కొమ్మురాజుల వెంకటేష్, మహేష్, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# దొమ్మాట ప్రాథమిక పాఠశాలలో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు

(మన ప్రజా ప్రతినిధి ఆగస్టు 26):సిద్దిపేట జిల్లా దొమ్మాట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి, అన్నాచెల్లెళ్ల అనుబంధం, ప్రేమ, ఆప్యాయతలను చాటుకున్నారు. పండుగ విశిష్టతను, రాఖీ ప్రాధాన్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. వెంకటేశం, ఉపాధ్యాయులు సర్దార్ హుస్సేన్, సుధాకర్ రెడ్డి, మౌనిక పాల్గొని విద్యార్థులను అభినందించారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది.



# యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు...జాతీయ రహదారి పై ధర్నా

మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట:చేగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని మాసాయిపేటలో యూరియా కొరతపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాసాయిపేట మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద జాతీయ రహదారి-44పై రైతులు ధర్నాకు దిగారు. ఫర్టిలైజర్ యాప్ను రద్దు చేసి పాత పద్ధతిలోనే యూరియా పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాప్లో నమోదు చేసిన గంటలోపే యూరియా స్టాక్ అయిపోయిందని, షాప్ యజమాని చెబుతున్నారని, సర్వర్ సమస్యలతో చదువురాని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కనీసం ఒకటి, రెండు యూరియా బస్తాలైనా దొరికేవని, ఇప్పుడు ఒక్క బస్తా యురియా దొరకడం లేదని పేర్కొన్నారు.విషయం తెలుసుకున్న చేగుంట ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డీ సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి, త్వరలోనే యాప్ లో బుక్ చేసుకున్న ప్రతి ఒక్క రైతు కి యూరియా వచ్చేటట్లు చూస్తానని చెప్పడంతో రైతులు శాంతించి రాస్తారోకో విరమించారు



# రైతు వేదికలో ఎఫ్ఎఫ్ఎస్ యాప్పై రైతులకు అవగాహన సదస్సు

మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట, ఆగస్టు 27 :చేగుంట మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి ఎం. హరిప్రసాద్ ఆధ్వర్యంలో రైతులకు ఎఫ్ఎఫ్ఎస్ (ఫ్రేమ్వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్) యాప్పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల కొనుగోలు, బుకింగ్ ప్రక్రియలో ఎఫ్ఎఫ్ఎస్ యాప్లో ఎదురవుతున్న వివిధ సాంకేతిక సమస్యలు, సందేహాలను రైతులకు క్షుణ్ణంగా వివరించి నివృత్తి చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ సులభతరంగా ఎరువులు పొందే విధానాన్ని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు మాధవి, కళ్యాణి, రమణ, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ఒక్క ఓటు కూడా కోల్పోకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి
# గాలి సంపత్ యాదవ్

మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ : మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ దమ్మాయిగూడలో ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా సవరణపై అనేక సందేహాలు అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోకుండా ఎన్నికల సంఘం తక్షణ చర్యలు తీసుకోవాలిదమ్మాయిగూడ డివిజన్4లో ఎస్ఐఆర్ రెండో విడత సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా దమ్మాయిగూడ ఓల్డ్ విలేజ్ రామాలయం ప్రాంగణంలో నిర్వహించిన ఓటర్ల జాబితా గ్రామసభలో పాల్గొని, వివిధ పోలింగ్ బూత్లకు సంబంధించిన ఓటర్ల జాబితాలను పరిశీలించడం జరిగింది.దమ్మాయిగూడ డివిజన్లోని 39 పోలింగ్ బూత్లలో గతంలో సుమారు 48,000 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం సుమారు 33,000 మంది మాత్రమే ఉన్నట్లు పరిశీలనలో వెల్లడైంది. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారు వంటి కారణాలతో కొన్ని ఓట్లు తొలగించబడటం సహజమైన ప్రక్రియ అయినప్పటికీ, అర్హత కలిగిన నిజమైన ఓటర్ల విషయంలో మాత్రం ఎలాంటి అన్యాయం జరగకూడదు.ప్రస్తుతం సుమారు 33,000 మంది ఓటర్లలో కేవలం 9,000 మంది వివరాలు మాత్రమే క్లియర్గా పూర్తయినట్లు, మిగిలిన సుమారు 24,000 మందికి నోటీసులు జారీ అయినట్లు అధికారులు తెలిపిన పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది.ముఖ్యంగా, గతంలోనుంచి ఓటరు జాబితాలో ఉన్నవారు, సరైన చిరునామా మరియు వివరాలు అందించినప్పటికీ కొందరికి నోటీసులు రావడం, నోటీసులు అందుకున్న వారికి ఒక్కో ప్రాంతంలో ఒక్కో గడువు ఇవ్వడం వంటి అంశాలపై స్పష్టత అవసరం.ఒక ముఖ్యమైన ప్రశ్న నోటీసు ఈరోజు అందించి, రేపే ఆధారాలు సమర్పించాల్సిందిగా గడువు ఇస్తే, సాధారణ ఓటరు అంత తక్కువ సమయంలో అవసరమైన పత్రాలను ఎలా సమర్పించగలరు?అదీ కాకుండా పండుగ రోజు కావడం, కొంతమంది ఓటర్లు ఇతర ప్రాంతాల్లో ఉండటం, ఫోన్లో సంప్రదించలేకపోవడం వంటి అనేక ప్రాక్టికల్ సమస్యలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో గడువు ముగిసిన కారణంగా నిజమైన భారత పౌరుడి ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి మాత్రం రాకూడదు.ఇక్కడ పనిచేస్తున్న బిఎల్ఓ లు, బిఎల్ఏ -2లు తమ పరిధిలో సాధ్యమైనంత వరకు ప్రయత్నం చేస్తున్నారు.వారిని తప్పుపట్టడం మా ఉద్దేశం కాదు. అయితే, వారికి కూడా స్పష్టమైన మార్గదర్శకాలు, నోటీసులు అందుకున్న ఓటర్ల పూర్తి సమాచారం, ఆన్లైన్లో పత్రాలు ఎలా అప్లోడ్ చేయాలి, ఏ ఆధారాలు స్వీకరించాలి వంటి అంశాలపై సరైన శిక్షణ మరియు వ్యవస్థ అవసరం.అలాగే, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు పోలింగ్ బూత్లలో ఉండటం, చిరునామా మార్పులు, కొత్తగా 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతకు అవకాశం కల్పించడం వంటి అంశాలు కూడా సమగ్రంగా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఎస్ ఐ ఆర్ అంటే కేవలం ఓట్లు తొలగించడం మాత్రమే కాదు అర్హులైన ప్రతి భారత పౌరుడి పేరు సరైన వివరాలతో ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటం కూడా ఎన్నికల సంఘం బాధ్యత.కాబట్టి ఎన్నికల సంఘం మరియు సంబంధిత అధికారులు.నోటీసులు అందుకున్న ఓటర్లకు తగినంత సమయం ఇవ్వాలి.సరైన ఆధారాలు ఉన్నప్పటికీ నోటీసులు వచ్చిన కేసులను ప్రత్యేకంగా పరిశీలించాలి.ప్రతి బి ఎల్ ఓ కు స్పష్టమైన మార్గదర్శకాలు, అవసరమైన సాంకేతిక సహాయం అందించాలి.నోటీసులు అందుకున్న ప్రతి ఓటరును సంప్రదించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలి.ఒకే కుటుంబంలోని ఓటర్ల వివరాలను సమగ్రంగా పరిశీలించి అవసరమైన చోట సరైన పోలింగ్ బూత్కు అనుసంధానం చేయాలి.అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా కేవలం సాంకేతిక లేదా ప్రక్రియాపరమైన సమస్యల వల్ల ఓటు హక్కును కోల్పోకుండా చూడాలి.గ్రామసభలు, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలి.ఓటు హక్కు ఒక సాధారణ హక్కు కాదు ప్రజాస్వామ్యానికి అది పునాది.ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్ది, నిజమైన ఓటర్లకు పూర్తి న్యాయం జరిగేలా ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకోవాలి.అర్హుడైన ఒక్క ఓటరు కూడా మిగలకూడదు..అనర్హుడైన ఒక్క ఓటు కూడా ఉండకూడదు అనే



# చతుర్వేద టాలెంట్ పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

(మన ప్రజా ప్రతినిధి ఆగస్టు 26):దౌల్తాబాద్: మండలంలోని సూరంపల్లి గ్రామంలోని చతుర్వేద టాలెంట్ విద్యాలయంలో రక్షాబంధన్ వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు సోదరసోదరీ భావంతో సంప్రదాయబద్ధంగా రాఖీలు కట్టుకుని పరస్పరం ఆప్యాయతను పంచుకున్నారు."నేను నీకు రక్ష.. నువ్వు నాకు రక్ష.. మనమిద్దరం ఈ దేశానికే రక్ష" అనే సందేశంతో దేశభక్తి, సోదరభావం, పరస్పర రక్షణకు ప్రతీకగా ఈ వేడుకలను నిర్వహించారు. రక్షాబంధన్ కేవలం అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానుబంధానికి మాత్రమే పరిమితం కాదని, సమాజంలో ఐక్యత, మానవత్వం, పరస్పర గౌరవాన్ని పెంపొందించే పండుగ అని విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జంగం శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సోదరభావం, దేశభక్తి, మానవతా విలువలను చిన్ననాటి నుంచే పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా భారతీయ సంప్రదాయాలు, సంస్కృతి, విలువలను విద్యార్థులకు పరిచయం చేస్తూ వారిని బాధ్యతాయుతమైన, క్రమశిక్షణ కలిగిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.విద్యార్థులు ఉత్సాహంగా రాఖీలు కట్టుకోవడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థులు ఆనందోత్సాహాలతో రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకర్తో పాటు ఉపాధ్యాయులు లింగం, ప్రభాకర్, కిరణ్, కృష్ణవేణి, భార్గవి, అనిత, రాధిక తదితరులు పాల్గొన్నారు.



# జీవో 97 ని తక్షణమే రద్దు చేయాలి

మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ,ఆగస్టు 27:పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చేటటువంటి జీవో 97 ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గురువారం పాలిటెక్నిక్ కళాశాల లోపల , విద్యార్థులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ప్లకార్డులతో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ జీవో నెంబర్ 97 కారణంగా విద్యార్థుల విద్యా భవిష్యత్తు, ఉన్నత విద్యా అవకాశాలు, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడే పరిస్థితి ఉందని.విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దని,చదువుకునే యువత జీవితాలను అయోమయంలోకి నెట్టొద్దని హెచ్చరించారు.విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి,జీవో నెంబర్ 97 రద్దు చేసే వరకు విద్యార్థులు పోరాటం కొనసాగుతుందని వారు అన్నారు.



# నూతన మహంకాళి ఆలయ కమిటీకి సన్మానం చేసిన ఎమ్మెల్యే

మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఆగస్ట్ 27: చేగుంట పట్టణంలోని శ్రీ మహంకాళి దేవాలయ కార్యవర్గంలో వైస్ ప్రెసిడెంట్ ఎన్నికైన గుండ్ల సంపత్, ప్రధాన కార్యదర్శి పులబోయినా రవి లను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గురువారం మాజీ సర్పంచ్ మంచి కట్ల శ్రీనివాస్ ఆఫీస్ లో ఘనంగా సన్మానించారు.ఈ ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆలయ ప్రాశస్త్యాన్ని కాపాడుతూ, అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు సాగాలని అయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చేగుంట మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్, జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి, నాయకులు డిష్ రాజు, ఐడియా మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# జనగామ ఐదవ వార్డులో వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

మన ప్రజాప్రతినిధి దినపత్రిక,జనగామ, నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం. జనగామ పట్టణంలోని ఐదవ వార్డులో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జనగామ మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి కడకంచి బాలమణి శ్రీనివాస్,మున్సిపల్ కమిషనర్, హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా చైర్పర్సన్,మొక్కలు నాటి,పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత కూడా ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు,ప్రజాప్రతినిధులు, ఆశా వర్కర్లు, ఆర్పీలు,మున్సిపాలిటీ సిబ్బంది,అధికారులు,స్థానిక ప్రజలు,పాల్గొన్నారు



# మర్మముల గ్రామంలో గ్రామసభ కార్యక్రమం

మన ప్రజాప్రతినిధి దినపత్రిక,మద్దూరు, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం. మద్దూరు మండలం, మర్మాముల గ్రామంలో గ్రామ సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ గౌడ్,అధ్యక్షతన SIR S26 ఓటర్ లిస్ట్ పై గ్రామ సభ నిర్వహించడం జరిగింది.సర్పంచ్ మాట్లాడుతూ ఓటు హక్కు మన భద్రత- మన బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, మండల సీనియర్ అసిస్టెంట్ పవన్,జిపిఓ సునీల్,పంచాయతీ కార్యదర్శి అశోక్,మరియు గ్రామ లైన్ అధికారులు,మహిళలు,గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.



# కరపత్రం ఆవిష్కరణకు తరలిరండి



మన ప్రజా ప్రతినిధి నర్సాపూర్ ఆగస్టు 27:మాల మహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన లిఛలో సెక్రటేరియట్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమం మెదక్ ప్రెస్ క్లబ్‌లో ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా మాల మహానాడు అధ్యక్షులు కల్లూరి సంజీవ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాలల చిరకాల డిమాండ్ల సాధన కోసం సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నామని, ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరిస్తున్నామన్నారు. జిల్లాలోని మాల మహానాడు నాయకులు, ప్రజా ప్రతినిధులు మాల కుల బాంధవులు రాష్ట్ర జిల్లా నాయకులు మండల నాయకులు కౌన్సిలర్లు గ్రామ అధ్యక్షులు,పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# గుండెపురిలో 'సర్' కార్యక్రమం




మనప్రజాప్రతినిధి//తిరుమలగిరి:తిరుమలగిరి మండల పరిధిలోని గుండెపురి గ్రామ కేంద్రంలో 'సర్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొమ్ము సోమన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తిరుమలగిరి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిలాల్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జుమ్మిలాల్ నాయక్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిని కాంక్షిస్తూ చేపట్టిన ఈ 'సర్' కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజలందరూ పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. సర్పంచ్ కొమ్ము సోమన్న మాట్లాడుతూ గుండెపురి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇరవై రెండవ వార్డులో SIR ప్రక్రియలో ఓటర్ లిస్టు పరిశీలన




మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం.జనగామ పట్టణంలోని ఇరవై రెండవ వార్డులో SIR ప్రక్రియలో భాగంగా నూతన ఓటర్ లిస్టు పరిశీలన కార్యక్రమం ప్రారంభమైంది.ఈ సందర్భంగా జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి కడకంచి బాలమణి శ్రీనివాస్,బి ఎల్ ఓ,సూచన మేరకు ఓటర్ లిస్టును పరిశీలించారు.ఈ సందర్భంగా ఓటర్లు తమ పేర్లు ఓటర్ లిస్టులో ఉన్నాయో లేదో బి ఎల్ ఓ.ను సంప్రదించి పరిశీలించుకోవాలని సూచించారు.ఓటర్ లిస్టులో పేరు లేని వారు బి ఎల్ ఓ.వద్ద నోటీసు/ఫారం స్వీకరించి,సుమారు రెండు రోజుల్లోపు సంబంధిత ఫారాన్ని పూర్తి చేసి బి ఎల్ ఓ.కు అందజేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళలు,స్థానిక ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# ఐదవ వార్డులో డ్రైనేజీ పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,జనగామ నియోజకవర్గం:జనగామ పట్టణంలోని ఐదవ వార్డులో డ్రైనేజీ పనులను జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి కడకంచి బాలమణి శ్రీనివాస్,ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో చైర్మన్,మున్సిపల్ కమిషనర్ పాల్గొని,డ్రైనేజీ పనుల పురోగతిని పరిశీలించారు.వార్డులో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# నేషనల్ హైవేపై బెల్ట్ షాపులు నిషేధించాలి



మనప్రజాప్రతినిధి// గరిడేపల్లి మండల్:గరిడేపల్లి నేషనల్ హైవేపై ఉన్న బెల్ట్ షాపులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అక్రమంగా మద్యం విక్రయించే దుకాణాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటా అన్ని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ అన్నారు గరిడేపల్లి మండల కేంద్రంలోని నేషనల్ హైవే వెంట ఉన్న బెల్ట్ షాపులు, హోటళ్లు, కిరాణా దుకాణాల యజమానులను గరిడేపల్లి ఎస్సై బి. శ్రీకాంత్ గౌడ్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేషనల్ హైవే వెంట ఉన్న ప్రతి దుకాణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణాల వద్ద జరిగే ప్రతి కార్యకలాపం నిఘాలో ఉండేలా కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా భద్రతను మరింత పెంచవచ్చని తెలిపారు. దుకాణ యజమానులు పోలీసులకు సహకరించి, ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకూడదని సూచించారు.అదేవిధంగా నేషనల్ హైవేపై వాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని ఎస్సై హెచ్చరించారు. ముఖ్యంగా హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల ముందు వాహనాలను రోడ్డుపై నిలిపివేయడం వల్ల ప్రమాదాలకు అవకాశం ఉంటుందని తెలిపారు. హైవేపై ట్రాఫిక్ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు.నేషనల్ హైవేపై ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. హైవేపై వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవు" అని ఎస్సై బి. శ్రీకాంత్ గౌడ్ స్పష్టం చేశారు.బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలినేషనల్ హైవే పరిధిలో అనుమతులు లేకుండా మద్యం విక్రయించే బెల్ట్ షాపులను నియంత్రించేందుకు సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. హైవే వెంట బెల్ట్ షాపుల నిర్వహణతో పాటు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పోలీసులు నిర్వహించిన కౌన్సెలింగ్‌తో పాటు నిబంధనలను ఉల్లంఘించే వారిపై నిరంతర నిఘా కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు. నేషనల్ హైవే భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులతో పాటు వ్యాపారులు, వాహనదారులు, ప్రజలు సహకరించాలని ఎస్సై సూచించారు.

# ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం.చేర్యాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో గురువారం ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఐదు వందలకు పైగా విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పోలోజు నరసింహ చారి తెలిపారు. ఇందులో ఇరవై ఎనమిది మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు వైద్య సిబ్బంది గుర్తించారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య శాల సిబ్బంది,అధ్యాపకులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన సర్పంచ్



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్ : రాంపల్లి గ్రామాం లో గురువారం రోజు ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించి అర్హత లేని ఓట్ల తొలగింపు పై కొత్త ఓట్ల నమోదు పై చర్చించారు.అనంతరం అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం గ్రామా సర్పంచ్ బొమ్మ మల్లయ్య ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబాలకు రేషన్ కార్డు అందుతుందని రేషన్ కార్డు ప్రతి పేద కుటుంబాలనికి ఎంతో కీలకమని, నిత్యావసర సరుకుల కోసం ప్రభుత్వం అందించే రాయితీలు, ఇతర సంక్షేమ ప్రయోజనాలను పొందేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విఆర్ఓ చంద్రం, సిరిసినగండ్ల విఆర్ఓ శ్రీకాంత్, బిఎల్ఓ క్రాంతి,వార్డు మెంబెర్స్ ధారం రజిని, కొంతం శ్రీనివాస్, బొమ్మ స్వామి, అత్కూరి వైకుంటాం, సీత యాదగిరి,అంగన్వాడీ టీచర్ కవిత గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# రజాకార్ల రాక్షసత్వాన్ని ఎదిరించిన వీర బైరాన్‌పల్లి..!



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,దూలిమిట్ట, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం. తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర వేసిన వీర బైరాన్‌పల్లి అమరవీరుల స్మరణ దినం సందర్భంగా జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి,గురువారం బైరాన్‌పల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. 1948 ఆగస్టు 27న రజాకార్ల దుశ్చర్యలకు బలై ప్రాణత్యాగం చేసిన నూట ఇరవై ఐదు మంది వీరులకు, వారి కుటుంబ సభ్యులకు శిరస్సు వంచి జోహార్లు అర్పిం చారు.అనంతరం నాటి అమరవీరుల కుటుంబ సభ్యులను, తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమంలో పాల్గొన్న వారిని, ప్రత్యేక పాత్ర పోషిం చిన ప్రముఖులను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి,ఘనంగా సన్మా నించారు.బైరాన్‌పల్లి పోరాట చరిత్రను వెలికితీసి,అనేక విషయాలను సేకరించి పుస్తక రూపంలో అందించిన డాక్టర్ చందా రామయ్య ని కూడా ఎమ్మెల్యే,ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి,మాట్లాడుతూ..ఆయుధాలు కలిగిన నిజాం సైన్యాలను సైతం ఎలాంటి ఆధునిక ఆయుధాలు లేకుండా కారం పొడి, కట్టెలు,సొంతంగా తయారు చేసుకున్న మందుగుండుతో బైరాన్‌పల్లి ప్రజలు ధైర్యంగా ఎదుర్కొ న్నారని కొనియాడారు.రజాకార్ల దాడులను నాలుగు సార్లు తిప్పికొట్టిన అనంతరం భారీ సంఖ్యలో వచ్చిన సైన్యం గ్రామంపై దాడి చేసి మారణకాండకు పాల్ప డిందని ఆవేదన వ్యక్తం చేశారు.బైరాన్‌పల్లి పోరాటం ఒక్క గ్రామానికి పరిమితమైనది కాదని,మద్దూరు, లింగాపూర్,కూటిగల్, బెక్కల్,దూళిమిట్ట,తదితర చుట్టు పక్కల గ్రామాల ప్రజలను రజాకార్ల దాడుల నుంచి రక్షించడంలో బైరాన్‌పల్లి యువకులు కీలక పాత్ర పోషించారని తెలిపారు.గ్రామ బురుజును రక్షణ కేంద్రంగా ఏర్పాటు చేసుకుని అనేక గ్రామాల ప్రజలకు అండగా నిలిచిన వీరుల చరిత్రను కొనియాడారు.చారిత్రక ప్రాధాన్యత కలిగిన బైరాన్‌పల్లి గ్రామానికి అధికారికంగా వీర బైరాన్‌పల్లిగా పేరు మార్చాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు ఇప్పటికే వినతిపత్రం అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.ప్రభుత్వం నుంచి ఎలాంటి అదనపు ఖర్చు లేకుండానే చేయగలిగే పేరు మార్పు విషయంలో ఇంతకాలం ఎందుకు జాప్యం జరిగిందో అర్థం కావడం లేదన్నారు.ఈ విషయంలో మరోసారి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పేరు మార్పు జరిగేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు.వీర బైరాన్‌పల్లి గ్రామానికి సంబంధించిన అభివృద్ధి పనులన్నింటినీ రాబోయే ఆరు నెలల్లో మంజూరు చేయించేలా దగ్గరుండి పర్యవేక్షి స్తానని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి,హామీ ఇచ్చారు.గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు.బైరాన్‌పల్లి చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన బురుజు ప్రస్తుతం శిథిలా వస్థకు చేరుకోవడం బాధాకరమన్నారు.ఈ బురుజును పునరుద్ధరించి స్మారక చిహ్నంగా,పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి

# సత్తయ్య కుటుంబాన్ని పరామర్శించిన మున్సిపల్ చైర్మన్



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం. జనగామ పట్టణంలోని ఇరవై రెండవ వార్డుకు చెందిన చీర సత్తయ్య అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబాన్ని జనగామ మున్సిపల్ చైర్మన్ కడప నుంచి బాలమణి శ్రీనివాస్ పరామర్శించారు. సత్తయ్య మృతితో తీవ్ర విషాదంలో ఉన్న వారి కుటుంబ సభ్యులను వారి పరిస్థితి అడిగి తెలుసుకుని వారికి అండగా ఉంటానని తెలిపి ఆర్థిక సహాయం అందజేశారు.మృతుని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారికి మనోధైర్యాన్ని కల్పించారు.అలాగే బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందించడానికి ముందు ఉంటానని తెలిపారు.